# వజ్రాలహారము

విమల సామాన్య కుటుంబములో పుట్టిన బిడ్డ, మంచి రూపవతి. ఆమెతండ్రి యామెను పెద్దగా భూస్థితియు, గుమాస్తా యుద్యోగము చేయుచున్న మోహనరావునకిచ్చి వివాహము జేసెను. విమలకు నగలు ధరించుటలో మిక్కుటమగు యాశ యుండెడిది. కాని స్వల్పస్థితిపరుడగు మోహనరావామెకు విలువగల నగలుచేయించి యామె యభీష్టము నెరవేర్చలేకుండెను. విమలకు మనస్సున నెన్నియో కోరికలు మొలకలెత్తుచుండెడివి గాని యవి తమంతట తామే యణగి పోవుచుండెడివి. భర్తతెచ్చు సంపాదన తిండికి, గుడ్డలకు సరిపోవుచుండెడిది. కాని విమలమాత్ర మెప్పుడును విచారముతోనే యుండెడిది.

ఇట్లు సంసారయాత్ర గడచిపోవుచుండగా నొకనాడు మోహనరావు ఆఫీసునుండి వచ్చునప్పుడొక శుభలేఖ బట్టుకొని వచ్చి విమలముందు పడవేసెను. ఆమె దానిని పరిశీలించిచూచి యొక వేడి నిట్టూర్పు విడిచెను. అందులకు మోహనరావు "విమలా నీవు సంతోషించుటకు మారు విచార పడెదవేల, మా ఆఫీసరుగారింటిలో వివాహము జరుగబోవుచున్నది. మనలనుగూడ రమ్మని యాహ్వానము వచ్చినది. ఇందులో విచారించుట కేమున్నద"నెను."

విమల:-"సంతోషించుట కేమియున్నది. ఆఫీసరుగారియింటి వివాహమునకు పోవలయునన్న నందులకు తగిన నగలుండవలయును, గుడ్డలుండవలయును. అవన్నియు లేని మనము వివాహమునకు పోవుట గౌరవహీనము."

మో:-"విమలా నేను సైకిలు కొరకు నూరు రూపాయలు నిలువచేసి యుంచినాను. దానికి తగునైన చీర తీసుకొనుము. నీవు సహజముగా సౌందర్యవతివి, కాబట్టి నీకు నగలులేకున్నను కష్టములేదు."

విమల:-"సరేలెండి, చీరకొన్న తర్వాత దానికితగ్గ నగ యొక్కటియైనా లేకున్న బాగుండదు. నాస్నేహితురాలైన సరోజిని నడిగి యొక్క నగయైనా తెచ్చుకొందున"నెను.

మో:-ఒకరి వస్తువులు యెరువు తెచ్చుకొనుట, అందులో నగలు నాకేమియు యిష్టములేదు, ఒకవేళ యెచ్చటనైనా గ్రహచారముతప్పి పడిపోయినచో మనమిచ్చుకొనుటకు శక్తిగలవారమా?

విమల:-చాలులెండి! ముందుగనే ఆమాట అంటారేమిటి నేనుమాత్ర మొకరి వస్తువులు తెచ్చినప్పుడు తగిన జాగ్రత్తతో మెలంగెదను. చీరయు, తగిన నగయు తెచ్చుకొందును. మోహనరావు తాను దాచియుంచిన నూరు రూపాయలు తెచ్చి విమలకిచ్చి తానాఫీసుకు వెళ్లిపోయెను.

విమలయు తన పనులన్నియు త్వరితముగా ముగించుకొని సరోజినింటికి వెళ్ళి "సరోజా నేను వివాహమునకు పోవలయును. నీవు మొన్న క్రొత్తగా చేయించుకొన్న వజ్రాలహార మిచ్చెదవా! పెండ్లయిన మరుసటిరోజే భద్రముగా తెచ్చియిచ్చెదను." అని అడిగింది. సరోజినియు సరేనని వెల్వెట్టు పెట్టెలో భద్రపరుపబడియుండిన వజ్రాలహారమును తెచ్చియిచ్చినది, తర్వాత విమలయు, సరోజినియు చీరలంగడికి వెళ్ళి మంచి కెంపుకలరు చీరయు, దానికితగ్గ రవికెయు తీసుకొని వచ్చిరి. సాయంకాలము మోహనరావు వచ్చినతోడనే విమల తాను తెచ్చిన వన్నియు చూపించినది. అతడును హారమును మాత్రము తగిన జాగ్రత్తతో గమనించుకొనుమని చెప్పెను.

పెండ్లికి పోవలసిన రోజాదయముననే విమల మేల్కొని స్నానపానములు ముగించుకొని తలదువ్వి పువ్వులతో చక్కగా నలంకరింకొని పట్టుచీర కట్టుకొని వజ్రాలహారము ధరించి అద్దములో తన ప్రతిబింబమును చూచుకొని చాల యానందించినది. తరువాత భర్తతో గూడ పెండ్లింటికి బయలుదేరినది.

పెండ్లింటిలో అందరును విమలను పరామర్శించువారే, ఆఫీసరు గారి భార్య కనకమ్మ "విమలా వజ్రాల హారము క్రొత్తగా చేయించుకొంటివా? నీకది చాలా బాగున్నదిసుమా!" యనినది. పెండ్లిసందడంతయు ముగిసిన పిదప సాయంకాలము విమలా మోహనరావు లింటికి యానందముతో వచ్చిరి. ఆమాట యీమాట మాట్లాడు కొనుచుండిరి. మోహనరావు "విమలా నీవు వజ్రాల హారము పెండ్లింటిలో చక్కని మర్యాద యిచ్చినదని" చెప్పుటయే తడవుగ విమల కంఠమున చెయ్యివేసి చూచుకొనగా హార మగుపించలేదు. "అయ్యో! హారమెచ్చటనో పోయినదే" యని యిల్లంతయు వెతకిరి అగపడలేదు. మోహనరావు తొందరగా తామువచ్చిన త్రోవనే వెతకుచు పోయెను గాని యెచ్చటను నగుపడలేదు. ఆఫీసరుగారి యింటికి పోయి వెతకుటకు మనస్కరించలేదు. ఇంటికి విచారముతో తిరిగి వచ్చెను. దంపతుల విచారమునకు మేరయే లేదు.

మరుసటిరోజు దంపతులిరువురు నగలషాపుకు వెళ్ళి సరోజిని వజ్రాలహారము మాదిరిది వెల యడుగగా నలభై వేలకు తక్కువ రాదనిరి. బేరమాడి తుదకు ముప్పయి వేలకు కుదుర్చుకొని నాలుగైదురోజులలో తెచ్చియిచ్చి హారము తీసుకొని వెళ్లెదమని చెప్పిపోయిరి. మోహనరావు తండ్రి సంపాదించిన భూమి నంతయు నమ్మగా యిరువదియైదు వేలు వచ్చినది. తెలిసినవారిదగ్గర అప్పులుతీసి హారమునకు చెల్లించి తీసుకునివచ్చిరి. విమలయు భద్రముగా దానిని తీసికొనివెళ్ళి సరోజిని కందజేసినది.

మరునాటి నుండియు దంపతులు వేరేయిల్లుమార్చుకొనిరి, దినమున కొకపర్యాయము భుజించుచు తమకగు వ్యయములన్నియు తగ్గించుకొని యెన్నెన్నో కష్టములుపడి పది సం॥ రములలో అప్పులవారి కందరికిని మొత్తమును యిచ్చివేసిరి. ఇందులకు గాను పడినశ్రమవల్ల వారి రూపములే మారిపోయినవి, వారిని పది సం॥ రముల క్రిందట చూచినవారు యిప్పుడు వారిని చూచిన గుర్తుపట్టుటకే శక్యము కానంతటి హీన స్థితికి వచ్చిరి. ఒకరోజున విమల సామానులు కొనుట కంగడి దగ్గరకు వెళ్ళియుండగా తన స్నేహితురాలగు సరోజిని యగుపడినది. సరోజిని విమలను గుర్తుపట్టలేదు. విమలయే ధైర్యంచేసి సరోజినియని పలుకరించినది. కష్టముమీద సరోజిని గుర్తుపట్టి "యేమి విమలా చాలా మారిపోయినావే" యనినది. విమలయు మారిపోవుటకు కారణము తన స్నేహితురాలే యని చెప్పినది. తాను సరోజిని వజ్రాలహారమును పోగొట్టిన విధమును, దానికిబదులు వేరొకటి కొనియిచ్చుటయు, అప్పులను తీర్చుటకు పడినకష్టములవల్ల మనిషి గుర్తుపట్టుటకు వీలులేనంత మార్పును గలుగ జేసినదని చెప్పినది. అందులకు సరోజిని చాలా విచారపడి "అయ్యో! ముందే నాకీసంగతి యెందులకు జెప్పగూడదు. నావజ్రాల హారమునందు గూర్చబడినవి నిజమైన వజ్రములుగావు. అవి రంగూను వజ్రములు. యిప్పుడైనా మునిగిపోయింది ఏమియులేదు. మన యింటికివచ్చిన వజ్రాల హారమిచ్చెదను. దానిని తీసుకొని వెళ్ళి యెవ్వరిదగ్గర తెచ్చినారో వారికిచ్చివేసి పైకం తీసుకొని రండు. తరువాత మనమిరువరము పోయి నాహారము రంగూను వజ్రములతో చేయబడినది కొనెదను మిగతాడబ్బు మీరుతీసికొని సుఖముగా నుందురుగాని" అని తన యింటికి తీసుకొనివెళ్ళి హారము విమలకిచ్చివేసినది. మోహనరావానందముతో హారమును అంగడివానికి యిచ్చివేసి సొమ్మునుతెచ్చి యిచ్చివేసెను. సరోజినియు తన రంగూను వజ్రముల హారమునుగొని మిగత ద్రవ్యమును విమలకిచ్చివేసినది. విమల మోహనరావు లానందముతో సుఖముగా జీవనము చేయుచుండిరి.

ఇప్పటికిని స్త్రీలలో కొంతమందికి యేచిన్న శుభకార్యమునకు పోవలసియుండినను తమ స్నేహితురాండ్ర దగ్గరనో బంధువుల దగ్గరనో నగలెరువు దెచ్చుకొని యలంకరించుకొని పోవుచున్నారు. ఇది యెప్పటికిని కష్టములకు కారణమని పైకథ యుదాహరణ మిచ్చుచున్నది.

బి. గౌరీదేవి.

——(o)——